## క్లుప్తంగా

### ముగిసిన కేంద్ర బృందం పర్యటన



**జగ్గయ్యపేట:** మండలంలోని బూదవాడ, బలుసుపాడు గ్రామాల్లో సోమవారం కేంద్ర బృందం కమిటీ సభ్యులు అశోక్, సూర్య పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లో గ్రామీణ ఉపాధీ హామి పథకం అమలు తీరు, పించన్ల పంపిణీ, హౌసింగ్ నిర్మాణాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు డ్వాక్రా మహిళలు స్త్రీనిధి చెల్లింపులు, పొదుపు రుణాల చెల్లిస్తున్నప్పటికి బ్యాంకుల్లో జమ కావడం లేదని కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు మణి, సూర్యప్రకాష్, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నందిగామటౌన్:** పల్లె ప్రగతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని అడవిరావులపాడు, లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవిరావులపాడులో రూ.20లక్షలు, లింగాలపాడులో రూ.25లక్షలు, తక్కెళ్లపాడులో రూ. 20లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వారం రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను తీర్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### రాయితీపై ఉల్లిపాయలు



**జగ్గయ్యపేట అర్బన్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట రైతుబజారులో రాయితీపై ఉల్లిపాయలు విక్రయిస్తున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ కేవీ.రమణ సోమవారం తెలిపారు. రైతుబజారులో ఉల్లిపాయలు కిలో రూ.40లకే విక్రయిస్తున్నామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### గ్రామసభ నిర్వహణ



**షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట):** గ్రామంలోని సచివాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ ఎల్.రాధికరాణి మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు ఉంటే గ్రామసభల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సభల్లో పట్టాదారు పాసుపుస్తకాల్లో మార్పుచేర్పులు, సర్వే నెంబర్లలో తేడాలు ఉంటే అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలంటూ ఏడుగురు రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సూరమ్మ, మండల సర్వేయర్ అనూష్, వీఆర్వో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.




నిరుపయోగంగా మారిన జగ్గయ్యపేట హైవే ఆర్టీసీ బస్టాండ్

# నిరుపయోగంగా హైవే బస్టాండ్

## పాలకుల నిర్లక్ష్యం-ప్రయాణికుల పాలిట శాపం

- రూ.కోటితో హైవే బస్టాండ్
- వినియోగంలోకి రాని బస్టాండ్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

**జగ్గయ్యపేటఅర్బన్:** పాలకుల నిర్లక్ష్యం కారణంగా జగ్గయ్యపేట పట్టణంలోని హైవే బస్టాండ్ నిరుపయోగంగా మారింది. జగ్గయ్యపేట పట్టణ ప్రజల సౌకర్యార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది ఈ హైవే బస్టాండ్‌ను నిర్మించారు. అయితే ఈ బస్టాండ్‌ను ప్రారంభించి సుమారు ఐదునెలలుదాటినా వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం అటు ఆర్టీసీ అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని..

జగ్గయ్యపేట పట్టణం జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల లోపలకు ఉండటంతో హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు హైవే మీద నుంచి జగ్గయ్యపేట పట్టణం లోపలకు వచ్చేవి కావు. దీంతో ఆయా నగరాలకు ప్రయాణం సాగించాల్సిన పేట ప్రాంత ప్రయాణికులు జగ్గయ్యపేట నుంచి తెలంగాణాలోని 20కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదాడ, 30కిలోమీటర్ల దూరంలోని నందిగామ పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో పట్టణ ప్రజలు ఈ ప్రాంతాలకు వెళ్లే అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈహైవే బస్టాండ్ నిర్మాణం చేపట్టింది.

### ఆరు ఫ్లాట్‌ఫాంలతో బస్టాండ్ నిర్మాణం..

జగ్గయ్యపేట పట్టణం జాతీయ రహదారి వరకు విస్తరించాలనే లక్ష్యసాధనకు హైవే బస్టాండ్ నిర్మాణం దోహదపడుతుందని భావించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఆటోనగర్‌లో ఫుడ్ ప్లాజా వెనుక ఏపీఐఐసీకి చెందిన ఎకరంన్నర స్థలంలో రూ.కోటి వ్యయంతో హైవే బస్టాండ్‌ను నిర్మించింది. హైవే బస్టాండ్‌కు రాకపోకలు ప్రారంభమైతే పట్టణం త్వరితగతిన హైవే వరకు విస్తరిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. హైవే బస్టాండ్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్, 6ఫ్లాట్ ఫారాలు, పార్సిల్ విభాగం, వాషింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఎలక్ట్రికల్ బస్సులకు సౌకర్యంగా ఉండేందుకు వీలుగా బస్టాండ్ భవనం ప్రక్కనే ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్ కూడా ఏర్పాటుచేశారు. తద్వారా భవిష్యత్‌లో హైవేపై రాకపోకలు సాగించే ఎలక్ట్రికల్ బస్సులకు ఈ ప్రాంతంలో చార్జింగ్ పాయింట్ ఉపయోగపడటంతోపాటు ఆర్టీసీకి కూడా మంచి ఆదాయం లభిస్తుందనే ప్రణాళికతో ఏర్పాట్లు చేశారు.

### వినియోగంలోకి తేవాలని డిమాండ్..

దశాబ్దాలుగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం అయిన హైవే బస్టాండ్ నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరిగినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం వెళ్లాలంటే కోదాడ, నందిగామకు వెళ్లకతప్పకపోతుండటంతో అవస్థలుపడుతున్నారు. జగ్గయ్యపేట హైవే బస్టాండ్ కార్యకలపాలు ప్రారంభమైతే మాకీ తిప్పలు తప్పుతాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని జగ్గయ్యపేట పట్టణంతోపాటు సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం..



జగ్గయ్యపేట నుంచి ఇతర నగరాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాం. హైవే బస్టాండ్ వినియోగంలోకి వస్తే విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రతి బస్సు ఇక్కడ ఆగుతుంది. తద్వారా ఈప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

– గోగుల వెంకయ్య, జగ్గయ్యపేట

### హైవే బస్టాండ్‌ను వాడుకలోకి తేవాలి..



ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి పనులు ఆగకూడదు. ప్రభుత్వ ధనంతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారకూడదు. రూ.కోటి ప్రజాధనంతో నిర్మించిన హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు పాలకులు తగిన చర్యలు తీసుకోవాలి.

– తన్నీరు నాగేశ్వరరావు,
వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

### రెండునెలల్లో వినియోగంలోకి..



బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రయాణికుల కోసం సీటింగ్ ఏర్పాట్లు చేయాలి. టాయిలెట్ల నిర్వహణకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలి. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తిచేసి, రానున్న రెండునెలల్లో హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం.

–ఎం.రఘురాం, జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో మేనేజర్

### గ్రామసభలో గందరగోళం



**సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు):** భూముల రీసర్వేకు సంబంధించి సోమవారం పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. పలువురు రైతులు మాట్లాడుతూ తమ భూముల సర్వేకు సంబంధించి ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా సర్వే అధికారులు స్పందించటం లేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దుచేసినపుడు గత ప్రభుత్వహయాంలో చేసిన సర్వే కూడా రద్దు కావాలి కదా? అని గ్రామసర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, పలువురు రైతులు ప్రశ్నించారు. దీంతో గ్రామసభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సభలో భూముల విస్తీర్ణాలకు సంబంధించి, జాయింట్ ఎల్‌పీ నంబర్లు ఉన్న భూములు, విస్తీర్ణం కొలతలు తేడాలకు సంబంధించి అర్జీలు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెల్ది ప్రభాకర్, డీటీ భాస్కర్, మండల సర్వేయర్ లాహోరి స్వప్న, వీఆర్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఏడు అర్జీలు అందజేత

**వీరులపాడు(కంచికచర్ల):** వీరులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయా భూముల సర్వే కోరుతూ ఏడుగురు రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

## వైన్‌షాపు తొలగించకపోతే సీఎం ఆఫీసుకు వెళ్తాం

విద్యాసంస్థల ప్రతినిధులు

**కంచికచర్ల:** ప్రజలకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా గత ప్రభుత్వం మద్యం షాపులను గ్రామానికి చివరన ఏర్పాటు చేయగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం షాపులను ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తోందని కంచికచర్ల మహిళలు మండిపడుతున్నారు. కంచికచర్ల నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యాసంస్థల ప్రతినిధులు సోమవారం కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ అధికారులు, ఎస్‌ఐ బోనగిరి రాజు, తహసీల్దార్ వి.జాహ్నవిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మహిళలు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల సమీపంలో మద్యంషాపులను ఏర్పాటు చేయడం తగదని పేర్కొన్నారు. కంచికచర్లలో హైవే వద్ద విద్యాసంస్థలకు సమీపంలో మద్యంషాపు ఏర్పాటుతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ విషయంపై రెండురోజుల కిందట ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి వినతిపత్రం అందజేసినప్పటికీ, తమ ఎదుట మొక్కుబడిగా అధికారులకు ఫోన్‌చేశారే తప్ప మద్యం షాపు తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జనవాసాల మధ్యన ఉన్న మద్యంషాపును తొలగించాలని మండలస్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేశామని వివరించారు. మరో రెండురోజుల్లో మద్యంషాపును తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోతే తమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, మహిళలతో కలిసి సీఎం చంద్రబాబు కార్యాలయానికి వెళ్తామని హెచ్చరించారు. ఆయాశాఖల అధికారులకు వినతిపత్రం అందజేసినవారిలో సంస్కృతి విద్యామందిర్, శ్రీ చైతన్య స్కూల్, కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు, మహిళలు ఉన్నారు.



తహసీల్దార్ జాహ్నవికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు, మహిళలు

## పెన్షనర్లను అందరూ గౌరవించాలి

**కంచికచర్ల:** ఉద్యోగులుగా సమాజానికి ఎంతో సేవచేసిన పెన్షనర్లను అందరూ గౌరవించాలని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో పెన్షనర్లంతా కలిసి ఎమ్మెల్యే సౌమ్యను సోమవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్ల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడతానని వివరించారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ గోపీకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌తో త్వరలో సమావేశం నిర్వహించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపారు. ఎంఈఓ బి.బాలాజీనాయక్, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు, కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, సంఘనాయకులు బొల్లం కృష్ణమూర్తి, చాపలమడుగు స్వర్ణలత, సర్వేశ్వరరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

## ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని డిమాండ్



తహసీల్దార్ పాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంద్రపాడు గ్రామస్తులు, నాయకులు, మహిళలు

**చందర్లపాడు(నందిగామటౌన్):** చందర్లపాడు మండలంలోని కాంద్రపాడులో పేదలకు ఇళ్లస్థలాలుగా కేటాయించిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వైఎస్సార్ సీపీ నాయకులు, ఇళ్లస్థలాల లబ్ధిదారులు సోమవారం చందర్లపాడు తహశీల్దార్ ఎం.పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు మాట్లాడుతూ కాంద్రపాడులోని జగనన్న లేఅవుట్‌లో రోడ్డు, పైపులను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఈ భూమికి ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణ చేసిందన్నారు. ఈ భూమిలో లేఅవుట్ వేసి పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వగా కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని, మరికొందరు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఈక్రమంలో ఈ భూమిని ఆక్రమించుకునేందుకు గ్రామానికి చెందిన దూలం కోటమ్మ, దూలం గోవర్ధన్‌రెడ్డి, దండా అవినాష్‌రెడ్డి, గొటిక శివకృష్ణారెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇళ్లు నిర్మించుకున్నవారిని కూడా ఖాళీచేయాలని బెదిరిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్మించిన రోడ్లు, పైపులైన్లను ధ్వంసం చేసిన విషయంపై తహశీల్దార్‌కు గతంలో ఫిర్యాదు చేసి పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడంతోపాటు రోడ్డుకు అడ్డుగా ముళ్లకంచె వేసి పేదలపై బెదిరింపులకు పాల్పడుతున్న సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ ఎం.పాల్‌ను కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినవారిలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, నాయకులు గుడేటి శ్రీనివాసరావు, కొండా కృష్ణారెడ్డి, వైఎస్సార్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, ఇళ్లస్థలాల లబ్ధిదారులైన మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

**మైలవరం:** మండలంలోని కొత్తగూడెం గ్రామం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ సోమవారం తెలిపారు. కొత్తగూడెం శివారులోని మామిడితోటలో కోతముక్క ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఆయన తన సిబ్బందితో దాడిచేసి బండారు కాసులు, రాజులపాటి పవన్ కుమార్, జానపాటి నాగ సత్యనారాయణ, గోపిరాజు, మేడూరి పుల్లారావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరినుంచి పేకముక్కలు, రూ.4680నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

**వ్యక్తిపై కేసు నమోదు..**

మరో కేసులో మైలవరం వీఆర్‌ఓ విధులను అడ్డుకున్నందుకు ఉమ్మ రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గణపవరం గణపతిగట్టులోని మామిడి తోటలో ఇసుక డంప్ స్వాధీనం నేపథ్యంలో వీఆర్‌ఓ వై.నాగమణి విధులను రమణారెడ్డి అడ్డుకున్నారు. వీఆర్వో ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఎల్‌ఓసీ మంజూరుపత్రం అందజేత

**జగ్గయ్యపేట అర్బన్:** వత్సవాయి మండలం చిన్న మోదుగుపల్లి గ్రామానికి చెందిన బొజ్జ వెంకటేశ్వరరావు మోకాళ్ల ఆపరేషన్ నిమిత్తం రూ.2.17లక్షలు మంజూరు చేస్తూ సీఎం కార్యాలయం జారీచేసిన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ)ని జారీచేసింది. ఈ ఎల్‌ఓసీని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోమవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై నిస్సహాయ స్థితిలో ఉన్న ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. వైద్యం నిమిత్తం ఎల్‌ఓసీ జారీ చేయించిన ఎమ్మెల్యే తాతయ్యకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, నాయకులు పులమోలు కోటేశ్వరరావు, ఏలూరి వెంకటేశ్వరరావు, కట్టా తిరుపతయ్య, లింగం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

## మద్యం బాటిళ్లు పట్టివేత

**వీరులపాడు(కంచికచర్ల):** అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ అఫ్రాఉన్నీసా బేగం హెచ్చరించారు. వీరులపాడు మండలం జమ్మవరంలో మహాలక్ష్మి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి ఆమె నుంచి 8మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

### ధాన్యం కొనుగోళ్లపై వీఏఏలకు అవగాహన

**కంచికచర్ల :** ప్రభుత్వం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి ధాన్యాన్ని సేకరిస్తామని పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ జయప్రద తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలపై కంచికచర్ల, వీరులపాడు మండలాల వీఏఏలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జయప్రద మాట్లాడుతూ ధాన్యం విక్రయించే రైతులకు ఖాళీ సంచులను ఇవ్వడంతోపాటు కళ్లాలో ఉన్న ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేందుకు అయ్యే రవాణా, కూలీల ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ధాన్యం ధర క్వింటాళ్లకు75 కిలోల సాధారణ రకం రూ.1725 నుంచి రూ. 2,300లు, ఏ గ్రేడ్ అయితే రూ. 1740 నుంచి రూ. 2,320 చెల్లిస్తామని వివరించారు. తహసీల్దార్లు వి.జాహ్నవి, హుస్సేన్, టీడీ సుమతి, ఏఓ కె.విజయకుమార్, అగ్రికల్చర్, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.





## రైతుబజారు విక్రయాల ద్వారా ఎమ్మెల్యేకు ముడుపులు


ఇంటూరి చిన్నా ఆరోపణ



మాట్లాడుతున్న ఇంటూరి చిన్నా

**జగ్గయ్యపేట అర్బన్:** రైతుబజారులో టమాటా, బంగాళాదుంప తదితర కూరగాయల విక్రయాల నుంచి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఆయన కుటుంబసభ్యులకు ముడుపులు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) ఆరోపించారు. తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంటూరి చిన్నా మాట్లాడుతూ కిలో టమాటాపై రూ.15నుంచి రూ.18 వరకు అధికంగా విక్రయిస్తున్నారన్నారు. ఖమ్మం మార్కెట్‌లో కిలో బంగాళాదుంప రూ.22లకు కొనుగోలు చేసి జగ్గయ్యపేట రైతుబజారులో రూ.42లకు అమ్ముతున్నారన్నారు. రైతుబజారులో ఒక్కో ఓటుకు రూ.3వేలు ఇచ్చి, గెలిచాక ఈ ఐదేళ్లలో అందుకు ఐదింతలు వసూల చేసేలా వ్యవహారం సాగుతోందన్నారు. ఎమ్మెల్యే కుటుంబమే నేరుగా టమాటా వ్యాపారం చేస్తుంటే, ప్రజలకు తక్కువ ధరలకు కూరగాయలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ఇకనైనా ఈ పరిస్థితి మారి, పేదలకు తక్కువ ధరలకే కూరగాయలు విక్రయించాలని డిమాండ్ చేశారు.

## పోలీస్ అమరవీరులకు ఘననివాళి



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎస్‌ఐ రాజు, పోలీస్‌సిబ్బంది, ఆటోడ్రైవర్లు

**కంచికచర్ల:** ప్రజాసేవకు అంకితమై విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులకు సెల్యూట్ చేస్తున్నామని ఎస్‌ఐ బోనగిరి రాజు పేర్కొన్నారు. కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పోలీసు అమరవీరుల చిత్రపటాలకు ఎస్‌ఐ, పోలీసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటారన్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండుగలను సైతం త్యజించి ప్రజల కోసం పనిచేసే ఏకైక వ్యక్తి పోలీసు అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తేనే సమాజంలోని ప్రజలు మంచి జరుగుతుందని పోలీసులకు సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, పోలీసులు కలసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌ఐ మంగ్యానాయక్, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.